# బాధ్యత

డాక్టర్ జగదీష్ ఎం.డి. ఎఫ్.ఆర్.సి.పి. బంగళా గుండెకు వేళ్లాడదీసిన సైన్ బోర్డును దూరన్నుండే చదివగానే 'చెడ్డీలు కట్టుకున్నప్పుడు, చిర్రాగొనే ఆటలో తనతో ఓడిపోయిన బడుద్దాయి ఇంత పెద్ద డాక్టరై కొండంత మేడ కట్టేశాడు....' అంతరాళాలలో చిన్న పాటి అసూయ చిరచిరలాడింది.

'ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే. వాడెంత పెద్ద డాక్టరైతేనేం, నాకు ప్రాణస్నేహితుడే గదా! అనుకోగానే గర్వం గురగురలాడింది.'

జగదీశ్‌ను చూచి చాలా రోజులైంది. బాతఖానీకెవరూ దొరకలేదని కాళ్లిటు లాక్కొచ్చినాయి.

'అయ్యగారున్నారా?' కాంపౌండర్నడిగాడు-స్వాతిశయంగా

'ఇంట్లో ఉన్నారండీ....కూచోండి.' ఆరిగిపోయిన రికార్డర్ లాగనేసి కుర్చీ చూపించాడు.

కింది పోర్షనంతా నర్సింగ్ హోంకు కేటాయించుకున్న డాక్టర్ జగదీశ్ పై అంతస్తులో ఉంటున్నాడు కుటుంబ సమేతంగా ఆ సమయంలో పేషంట్సుండరు. ఎమర్జంట్ కేసులొస్తే పిలిపించుకుంటారు-కాంపౌండర్‌తో.

చెదరిన మనసుతో ఇంటి నుండి బయల్దేరిన సహదేవ్

కాస్సేపు టైంపాస్ చేద్దామని వచ్చాడు.

గోడకు వేళ్లాడుతున్న గడియారం ఏడున్నర చూపిస్తుంది. సీలింగ్ ఫాన్ గాలి ఒంటిని చల్లగా నిమిరింది. చూపులు శూన్యం లోకి చొచ్చుకు పోతుంటె మాండవి మస్తిష్కంలో కదిలింది.

'ఏమండీ ...' ఆఫీసునుండి రాగానే గోముగా పిలిచి కాఫీ అందించింది మాండవి, భార్య పిలుపు ఏకొత్త చీరకో, కొత్తరకం నెక్లెస్‌కో ప్రతిపాదనలాగన్పించింది, పెదవుల మీద చిరునవ్వు తొంగి చూచింది. వాతావరణం అనుకూలంగా ఉంది. ఒకచేత్తో కాఫీ కప్పందుకుంటూ మరోచేత్తో మాండవి నడుమును చుట్టెయ్య బోయాడు-తను.

'ఛ....ఏమిటా చిలిపి చేష్టలూ. పిల్లలు వచ్చే టైమైంది,' మాండవి బుగ్గలు ఎర్రమందారాలైనై. దూరంగా జరిగి ఎదురుగా కూర్చుంది. కప్పు ఖాళీ అయేదాకా కళ్ళే మాట్లాడుకున్నాయి.

'ముచ్చట సంబరాన మొగుణ్ని మరిచినట్టూ... అసలు సంగతి మరిచి పోతున్నా'వంది మాండవి అంతరంగం. మొహం నిండా గాంభీర్యం అలుముకుంది, ఖాళీ కప్పందుకుంటూ

'మన పిల్లల సంగతండీ ...!' అంది

ఆవిడ మొహంలో అప్పటి కప్పుడే మారిన రంగుల్ని చది వేస్తూ

'పిల్లల సంగతా....? ఇంకా ట్యూషన్నుంచి రానట్టుంది గదా?' బయటికి పోబోయాడు

'అదికాదండీ... వాళ్ళ చదువు గురించి మీరేమన్నా పట్టిం చుకుంటున్నారా?'

కొత్త ఆరోపణ అడుగు ముందుకు పడనీయలేదు.

'నాపిల్లల సంగతి పేను పట్టించు కోవడం లేదా?'

'ఔను...!'

'గుమాస్తా ఉద్యోగం చేస్తున్నా ఇద్దరు పిల్లల్ని మంచి పేరున్న బడిలో చేర్పించా. ట్యూషన్‌కు పంపిస్తున్నా జీతంలో ఆరోవంతు పిల్లల చదువులకే ఖర్చైపోతుందన్న సంగతి నీకు తెలీదా?' చిరాకేసిందతనికి.

తన వాలకానికి జాలేసిందావిడకు.

'ఖర్చవుతున్న మాట అక్షరాలా నిజం. కాని మీరెప్పుడన్నా వాళ్ల ప్రగతి పత్రాలు చూశారా? ప్రతిసారి నేనే సంతకం జేసి పంపిస్తున్నా'

'పొద్దట్నుంచి ఆఫీసులో అడవ చాకిరీ చేసొచ్చా. సాయంత్రమన్నా కాస్సేపు ఫ్రెండ్స్‌తో కులాసాగా గడుపుదామనుకుంటే ఇదోగోల' అనుకుని పైకి 'ఐతే ఏమైందట॥' అనేశాడు.

'యూనిట్ అర్ధవార్షిక పరీక్షలలో చాలా తక్కువ మార్కులు తెచ్చుకుంటున్నారు. కొన్ని సబ్జెక్టులలో ఫెయిలైనారు గూడా వచ్చేవి వార్షిక పరీక్షలు పరిస్థితి ఇలాగే ఉంటే వాళ్ళేమై పోతారో నని భయంగా ఉందండీ!'

తన బుర్ర బొంగరంలా తిరిగింది. 'ఐతే.... నువ్వు రోజూ రాత్రి వాళ్లను చదివించడం లేదా?'

పరిస్థితి ఎదురు తిరుగుతుందని అర్థమై పోయింది మాండవికి.

'రోజూ చీవాట్లేసి కూర్చోబెడ్తున్నాను. కాస్సేపు కబుర్లు చెప్పుకున్నా చాలా సేపే చదువుకుంటున్నారు. మధ్య మధ్యే

వాళ్లకర్థంగాని వేవో అడిగేస్తున్నారు. నాదేమో వానా కాలం చదువాయె. మీరేమో పదిలోపల ఇంటికి రారాయె. వాళ్ల సందే హాలు తీర్చడం నావల్ల కావడం లేదు.'

'ఈ ఎత్తంతా నన్నింట్ల కట్టి పడెయ్యటానికే కదూ!'

జవాబు కెదిరి చూడకుండా వచ్చేశాడు-నవ్వుతూ.

'ఏదన్నా ఎమర్జన్సీకేసా సార్!' నిశ్శబ్దాన్ని చీల్చాటు కాంపౌండర్.

'కాదు....డాక్టర్ నాస్నేహితుడు కలిసి పోదమనొచ్చా!'

'అలాగా.... మీ పేరుసార్!'

చెప్పాడు.

చకచకా పైకెళ్ళి రెండు నిముషాలలో తిరిగొచ్చాడు

''మిమ్ములన్ని పైకి రమ్మంటున్నారు సార్!'

మెట్లెక్కుతుంటే జగదీశ్ మాటలు వినబడుతున్నై.

వెధవా! ఒక్క లెఖ్ఖను రెండుసార్లు చెబితేగాని అర్థమవ డంలేదు. సరే....ఇది చెయ్!'

సహదేవ్‌ను సాదరంగా ఆహ్వానించాడు డాక్టర్ జగదీశ్. మిత్రులు మాటల్లో పడిపోయారు. మధ్య మధ్య జగదీశ్ కొడుకు లెఖ్ఖల గురించి అడుగుతూనే వున్నాడు- అతడు చెబుతూనే వున్నాడు-విసుక్కోకుండా.

సహదేవ్‌కు ముళ్ళమీద కూచున్నట్టనిపించింది.

'పిల్లలు బావున్నారా అన్నయ్యా!' డాక్టర్ భార్య కూల్ డ్రింక్స్ అందించింది.

''బావున్నారమ్మా!"

'రామేశ్వరం పోయినా శనేశ్వరం వొదలదన్నట్టు....నాల్గు చేతులా సంపాదిస్తున్నావ్.... పిసినారితనం మాత్రం నిన్నొదల లేదురా....' అందామనుకుని తమాయించుకున్నాడు.

'ఏరా బాబుకు ట్యూషన్ పెట్టలేదా?'

'పెట్టాన్రా.... మరి నీ పిల్లలకూ!'

'పెట్టించాను....కాని నువ్వే మీవాడికి లెఖ్ఖలు చెబుతున్నా వేమిటి? బడిలో ట్యూషన్లో చెప్పరా? ఎందుకుఢా అనవసరమైన శ్రమ.' మందలించాడు-ఖాళీ గ్లాసు టేబుల్ మీదుంచుతూ.

డాక్టర్ జగదీశ్ పెదాలమీద చిరునవ్వు మెరిసింది.

'మావాడిది కాస్త మంద బుద్ధిరా. ఒకటికి నాల్గుసార్లు చెబితేగాని అర్థం గాదు. ఐనా...స్కూల్లో, ట్యూషన్లో చెప్పే మాస్టార్లు జీతం డబ్బుల కోసం చెబుతారు. డబ్బులు పుచ్చుకుంటున్నారు కాబట్టి. ఒకటి లేదా రెండు సార్లు చెబుతారు. కాని అర్థమయేదాకా అందరికీ చెప్పలేరుగదా!. తండ్రిగా వాడెంత వరకు చదివాడు, అర్థం కాని వేమున్నాయని తెలుసుకుని పదిసార్లయినా సరే వాడి కర్థమయేలా చెప్పే బాధ్యత నా మీదుంది. పేషెంట్స్లేని సమయాల్లో వీడితోనే గడిపేస్తా రోజూ కాస్సేపు.' సహదేవ్‌లో కలకలం బయలు దేరింది. మొహమ్మీద నీలినీడలు తిరగాడుతున్నై.

'అదేమిట్రా అలాగై పోయావ్! చాలా రోజుల తర్వాత కలిశాం గదా....చెప్పు కబుర్లు.'

డాక్టర్ జగదీశ్ మాటలు సహదేవ్ బుర్రలో కెక్కలేదు.

'సేనెళ్లొస్తా్రా.... పిల్లలకు వార్షిక పరీక్షలు దగ్గరి కొస్తున్నై' అంటూ మెట్లు దిగాడు. డాక్టర్ జగదీశ్ దంపతులు మొహాల్ని చూచుకుని నవ్వుకున్నారు - సంగతేమిటో అర్థం గాక.

* * *

(జాగృతి 1-7 మే 1989)